నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 16 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL

## చట్ట ప్రకారమే భూ బదలాయింపులు చేపట్టాలి..


మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 15 : నిర్మల్ జిల్లాలో అభివృద్ధి పనుల నిర్వహణలో అటవీ భూముల వినియోగానికి సంబంధించి ఫారెస్ట్ కన్జర్వేటర్ చట్టం మేరకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అటవీ భూములపై చేపట్టే అభివృద్ధి పనులకు పరివేశ్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలి. జిల్లా స్థాయిలోనే మంజూరు చేపి అభివృద్ధి కార్యక్రమాలు ఆపకుండా కొనసాగించేలా చూడాలని అటవీ అధికారులకు సూచించారు. అబివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడానికి అటవీ, రెవెన్యూ, విద్యుత్, ఇంజినీరింగ్ శాఖలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. అనంతరం పరివేశ్ పోర్టల్ గురించి అవగాహన కల్పించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఎఫ్‌వో నాగిని భాను, ఆర్డీవో రత్న కల్యాణి పాల్గొన్నారు.

## అందాల పోటీలు రద్దు చేయాలని నిరసన


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా సంఘ సభ్యులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 15 : వచ్చే నెల హైదరాబాద్‌లో నిర్వహించే 72వ ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలని పీవోడబ్ల్యూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి అన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో వచ్చే నెల 7వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే అందాల పోటీలను రద్దు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఏవోకు వినతి పత్రం అందించారు. అనంతరం టీఎన్‌జీవో సంఘ భవనంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

*బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన వరంగల్ నిర్వహించే రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను మంగళ వారం ఎమ్మెల్యే నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త మన అధినేత సందేశాన్ని వినడంతోపాటు వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంతకు ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో మండలాలవారీగా ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కన్వీనర్లు శివారెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నిమ్మల ప్రీతంరెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, పండరి, మహేందర్‌రెడ్డి, సురేందర్, బాబులాల్, గులాబ్‌సింగ్, ప్రతాప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.*

*- నేరడిగొండ, ఏప్రిల్ 15*


నేరడిగొండలో బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# ‘హస్తం’లో మంత్రి పదవి చిచ్చు!

**తనకు అన్యాయం చేస్తే సహించేది లేదన్న పీఎస్సార్**

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తేనే కాంగ్రెస్‌లోకి వచ్చానన్న వివేక్
- అధిష్ఠానమే నిర్ణయిస్తుంది.. సీనియర్‌గా మంత్రి పదవి అడగడంలో తప్పేంటన్న వినోద్
- మినిస్టర్ పదవి కోసం ఎవరికి వారే పోటాపోటీ
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో కాకరేపుతోన్న తాజా పరిణామాలు
- అనుయాయులకు పదవి కోసం మూడుగా చీలిపోయిన రాష్ట్ర మంత్రులు..?
- హస్తంలో తారాస్థాయికి చేరిన వివాదాలు..
- చర్చనీయాంశంగా మారిన వ్యవహారం




మంచిర్యాల, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో మంత్రి పదవి ‘కాక’ రేపుతున్నది. అధికార పార్టీ నుంచి నలుగురు ఎమ్మెల్యేలుండగా.. అందులో ముగ్గురు మంచిర్యాల జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహించడం.. ఆ ముగ్గురూ మంత్రి పదవి రేసులో ఉండడం ‘హస్తం’లో చిచ్చు రేపుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మంచిర్యాల జిల్లా ఎమ్మెల్యేలు ఎవరికి వారే మంత్రి పదవి తనకే వస్తుందంటూ చెప్పుకుంటూ వచ్చారు. రాష్ట్రంలోని పార్టీ పెద్దలు ఎవరికి వారు తమ అనుయాయులకే మంత్రి పదవి ఇవ్వాలంటూ మూడు జాబితాలను అధిష్ఠానానికి ఇచ్చినట్లు తెలిసింది. ఉగాది సందర్భంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందంటూ అనేక వార్తలు వచ్చాయి. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు మంత్రి పదవి వస్తుందని.. లేదు.. మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్‌కే మంత్రి పదవి ఖాయమైందని.. అసలు ఈ ఇద్దరికీ కాకుండా సీనియరైన బెల్లంపల్లి ఎమ్మెల్యే వివేక్‌కు పదవి వస్తుందంటూ చర్చ నడిసింది. ఎమ్మెల్యేల అనుచరులు సైతం మంత్రి కాబోయేది మా సారే అంటూ.. ఎవరికి వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మంత్రి పదవి విషయంలో రోజూ ఏదో ఒక చర్చ నడిచింది. ఈ క్రమంలోనే విస్తరణకు బ్రేక్ పడడంతో మంత్రి పదవి ఆశావాహులు ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది. కానీ మంత్రి వర్గ విస్తరణకు బ్రేక్ పడడంతో..ఎవరికి వారు మంత్రి పదవి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో వివాదాలు మరింత ముదిరిపోయాయి. అవి కాస్త ఇప్పుడు వ్యక్తిగత విమర్శల దాకా వెళ్లాయి. పదవి కోసం పట్టువిడిచేది లేదని మంచిర్యాలలో మంత్రుల సభ సాక్షిగా పీఎస్సార్ స్పష్టం చేయగా, అదే రోజు మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ఎవరికి వారు తేల్చి చెప్పడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

### మంత్రుల సమక్షంలోనే అసంతృప్తి..

మంత్రి పదవి రేసులో ఉన్న ఎమ్మెల్యే పీఎస్సార్ మంచిర్యాలలో సోమవారం నిర్వహించిన బహిరంగసభలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు సమక్షంలో అసంతృప్తి వెల్లగక్కారు. 20 ఏండ్లుగా పార్టీని పట్టుకొని ఉన్నానని, కష్టకాలంలో కూడా విడిచిపెట్టకుండా అధికారంలో వచ్చేందుకు కృషి చేశానని, ఇంద్రవెల్లి, మంచిర్యాల సభను విజయవంతం చేశానని.. ఇంత చేసినా నన్ను కాదని నిన్న.. మొన్న పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి పదవి ఎలా ఇస్తారంటూ పీఎస్సార్ సభలోనే మాట్లాడారు. నాకు అన్యాయం చేస్తే సహించేది లేదంటూ స్పష్టం చేశారు. ఒక్క కుటుంబంలో ముగ్గురికి పదవి ఇచ్చారని.. ఇప్పుడు మంత్రి పదవి కూడా ఇస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసినట్లే అవుతుందన్నారు. అదే జరిగితే ఉమ్మడి జిల్లాలో ‘తిరుగుబాటు’ తప్పదంటూ కుండబద్దలు కొట్టారు. దీనిపై వివేక్ సైతం స్పందించారు. బీజేపీలో ఉంటే కేంద్ర మంత్రి పదవి వచ్చేదని.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తేనే తాను కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. పీఎస్సార్ వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. పార్టీలు మారడం ముఖ్యం కాదని, ప్రజలకు ఎంత మంచిపని చేశామన్నదే ముఖ్యమంటూ మండిపడ్డారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ పీఎస్సార్ వ్యాఖ్యలపై స్పందించారు. కాక కుటుంబంలో ముగ్గురికి పదవులు ఇచ్చారని మాట్లాడం సరికాదన్నారు. పదేళ్లు పార్టీ కోసం పని చేసిన ఆయనే అలా మాట్లాడితే 70 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ కోసమే కాక కుటుంబం పని చేస్తుందన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో పీఎస్సార్‌కు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వమని సిఫార్సు చేశామన్నారు. అవన్నీ మర్చిపోయి మా కుటుంబం గురించి మాట్లాడడం సరికాదన్నారు. సీనియర్ ఎమ్మెల్యేగా తాను మంత్రి పదవి ఆశించడంలో తప్పేమీ లేదన్నారు. ఇలా ముగ్గురు నేతలు ఎవరికి వారు మంత్రి పదవిపై పట్టుబట్టిన నేపథ్యంలో మంత్రి పదవి ఎవరికి ఇచ్చినా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మూడుగా చీలిపోయే ప్రమాదం లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

### పథకం ప్రకారమే మీటింగ్..

మంత్రివర్గ విస్తరణలో రాష్ట్రనాయకత్వం సైత ఎవరికి వారే యమునా తీరేలా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ముగ్గురు అధిష్ఠానానికి మూడు నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. ఎవరి అనుయాయుల పేర్లను వారు ప్రతిపాదించినట్లు తెలిసింది. మంత్రి పదవుల విషయంలో రాష్ట్రంలోని మంత్రులు సైతం మూడు వర్గాలుగా చీలిపోయారనే ప్రచారం నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అత్యంత సన్నిహితుడిగా పేరు ఉన్న పీఎస్సార్‌కు మంత్రి పదవి కోసం ఆయన ప్రతిపాదించి ఉండవచ్చనే చర్చ పార్టీలో నడుస్తుంది. ఈ లోగా మంత్రి వర్గ విస్తరణ వాయిదా పడడంతో వివేక్, వినోద్ సైతం రేసులోకి రావడంతో ఎత్తుగడంలో భాగంగానే మంత్రుల సభ నిర్వహించారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొన్నటికి మొన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైతం నాకు బరాబర్ మంత్రి పదవి ఇవ్వాల్సిందేనంటూ ఓ మీటింగ్‌లో డిమాండ్ చేశారు. అదే తరహాలో మంచిర్యాలలో సభ జరగడం, మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ సైతం తనకు మంత్రి పదవి విషయంలో అన్యాయం చేస్తే సహించేది లేదంటూ చెప్పడం పథకం ప్రకారమే జరిగి ఉండవచ్చనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. భట్టి విక్రమార్క తన మార్క్‌ను చూపించుకోవడంలో భాగంగానే తన అనుయాయుడికి పదవి కోసం పట్టుపడుతున్నట్లు తెలుస్తుంది. పక్క జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు సైతం కాక కుటుంబంలో వారి కంటే పీఎస్సార్‌కు పదవి వస్తే స్థానికంగా తనకు ఎదరు ఉండదని భావిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఇద్దరు మంత్రులు సపోర్ట్ చేస్తున్నారనే చర్చ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో నడుస్తుంది. మరో వైపు వివేక్ వెంటకస్వామికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సపోర్ట్ చేస్తున్నారు. పార్టీలో చేరే సమయంలో సీఎం, సునీల్ కనుగోలు మంత్రి పదవి హామీ ఇచ్చారంటూ నిన్న ప్రెస్‌మీట్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే చెప్పకనే చెప్పారు. తాను సైతం సీనియర్‌గా పదవి కోరుకుంటున్నట్లు మనసులోని మాటను బయటపెట్టారు. వినోద్ గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వంలోనే మంత్రిగా పని చేశారు. అధిష్ఠానంలో తనకున్న పరిచాలతో ఆయన కూడా గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. కాక కుటుంబంలో ఎవరికి మంత్రి పదవి వచ్చినా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం మొత్తం ఆ ఎఫెక్ట్ ఉంటుంది. రాష్ట్ర రాజకీయాల్లో సైతం వారు కీలకంగా మారిపోతాయి. అదే జరిగితే తమకు ఇబ్బందులు తప్పవని కొందరు మంత్రులు భావిస్తున్నట్లు తెలిసింది. అదే పీఎస్సార్‌కు వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే పరిమితం అవుతారు. రాష్ట్రంలో మన బృందంలో మకొకరు చేరి బలం పెంచుకోవచ్చనే ఆలోచనల్లో ఓ మంత్రుల వర్గం ఉన్నట్లు సమాచారం. అలా పట్టుబిగించడంలో భాగంగా వ్యూహాత్మకంగా మంచిర్యాలలో మంత్రుల సభ నిర్వహించారనే టాక్ నడుస్తున్నది. ఏదేమైనా జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు ఎవరికి వారు మంత్రి పదవి రేసులో ఉండడం.. ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో గందరగోళం పెంచింది. మంత్రివర్గ విస్తరణ జరిగితే పార్టీ చీలిపోయే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే కాంగ్రెస్‌కు తీవ్రనష్టం జరిగే అవకాశాలున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరి దీన్ని పార్టీ పెద్దలు ఎలా ఫేస్ చేస్తారా అన్నది వేచి చాడాల్సి ఉంది.

# రేషన్ కార్డుల కోసం నిరీక్షణ



**సర్వే పేరిట ప్రభుత్వం కాలయాపన**

- దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక యాప్
- ఈసారి రెవెన్యూ శాఖ ద్వారా రీ వెరిఫికేషన్
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- పెండింగ్‌లో 40 వేలకు పైగా దరఖాస్తులు

కుభీర్ మండలం మర్లగొండ, డోడర్న, సాప్లీ గ్రామాల్లో రేషన్‌కార్డు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది



నిర్మల్, ఏప్రిల్ 15(నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల్లో భాగంగా అర్హులైన పేదలకు అందజేస్తామన్న రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా.. కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. వేలాది మంది ఎదురు చూస్తున్నా రేషన్ కార్డుల పంపిణీ ప్రహసనంగా మారింది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 10,192 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసుకునేందుకు మరో 30,973 మంది దరఖాస్తులు అందించారు. ఇలా 41,165 మంది అర్హులైన వారు ప్రభుత్వం అందజేసే రేషన్ కార్డుల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ-సర్వే పేరిట అధికారులు దరఖాస్తుదారుల ఇళ్ల చుట్టూ తిరుగుతుండడంతో ఇప్పట్లో అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందే పరిస్థితి కనిపించడం లేదు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి, తన సిబ్బందితో కలిసి దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి విచారణ చేస్తున్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రంతోపాటు ఎల్పీజీ కనెక్షన్ వివరాలను సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా ఆర్ఐ లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వివరాలను ఆయా మండలాల పరిధిలోని తహసీల్దార్లు పరిశీలించి డీఎస్‌వో(జిల్లా పౌర సరఫరాల అధికారి) లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలి. ఆ తర్వాత అన్ని వివరాలు సక్రమంగా ఉంటే అప్పుడు డీఎస్‌వో అప్రూవల్ ఇస్తారు. ఈ ప్రాసెస్ అంతా పూర్తవ్వాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అర్హులైన వారి వివరాలు సేకరించిన తర్వాతనే ప్రభుత్వం కొత్త కార్డులను జారీ చేసే అవకాశం ఉన్నది. అప్పటి వరకు ఎదురుచూపులు తప్పేలా లేవు.

### అన్నింటికీ రేషన్ కార్డే ఆధారం

నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం 2,08,606 రేషన్ కార్డులు ఉండగా, ఇందులో అంత్యోదయ 12,827, సాధారణ 1,95,747, అన్నపూర్ణ 32 కార్డులు ఉన్నాయి. ఆయా కార్డుల ద్వారా జిల్లా వ్యాప్తంగా 6,30,242 మంది లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందుతున్నాయి. వీరి కోసం ప్రతి నెల 412 రేషన్ దుకాణాల ద్వారా 39,957 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇటీవల రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో అర్హులు రేషన్‌కార్డు లేకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలమై ఉండి కూడా బహిరంగ మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.40లకు కిలో బియ్యాన్ని కొనుక్కుంటున్నామని వాపోతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పథకం అమలుకు రేషన్ కార్డునే ప్రామాణికం చేయడంతో అర్హులైన వేలాది మంది పేదలు రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు దరఖాస్తులను స్వీకరించింది. మళ్లీ తాజాగా రీ సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో ఇప్పటికే జాబితాలో పేర్లున్న వారు ఆందోళన చెందుతున్నారు. పాత జాబితా ప్రకారం ఉన్న కుటుంబాలపై మరింత లోతుగా సూక్ష్మ శోధన చేసి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకే ప్రభుత్వం రీ సర్వే అంటూ డ్రామాలు ఆడుతున్నదని పేదలు మండిపడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే సిలిండర్ వంటి పథకాలన్నింటికీ రేషన్ కార్డే ఆధారం కావడంతో ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోలేక నష్టపోతున్నామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు లేకుండా కనీసం ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని పొందలేని పరిస్థితి నెలకున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా సర్వేల పేరిట కాలయాపన చేయకుండా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### పిల్లల పేర్ల నమోదుకు దరఖాస్తు చేసిన..



*మాది కుభీర్ మండలంలోని చొండి గ్రామం. మాకు దాదాపు పదేండ్ల కిందట పెళ్లి కాగా, నాది, మా భర్త పేరు మీద తెల్ల రేషన్ కార్డు ఉంది. మాకు 9, 5 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు కొడుకులు ఉన్నారు. మాది చాలా పేద కుటుంబం. కార్డులో మా ఇద్దరి పేర్లే ఉండడంతో 12 కేజీల బియ్యం మాత్రమే వస్తున్నాయి. మా పిల్లల పేర్లు రేషన్‌కార్డులో ఎక్కించాలని ఆఫీసుల చుట్టూ తిరిగినం. అయినా పని కాలేదు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు తాము గెలిస్తే అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తమన్నరు. 15 నెలలుగా ఎదురు చూస్తున్నం. ఇప్పటి వరకు మూడు సార్లు మీ సేవలో దరఖాస్తు చేసుకున్న. అయినా పిల్లల పేర్లు ఎక్కలేదు. ఇప్పటికైనా ఆఫీసర్లు స్పందించి మా పిల్లల పేర్లను రేషన్‌కార్డులో చేర్చి అదనంగా బియ్యం వచ్చేటట్లు చూడాలి.*

**-సంగోజి కల్యాణి, రేషన్‌కార్డు దరఖాస్తుదారు, చొండి, కుభీర్ మండలం.**

### నూకలే దిక్కవుతున్నాయ్..



*మా ఇంట్లో భర్త నర్సయ్యతోపాటు 7,5 ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు వికలాంగుడైనా వికలాంగ పింఛన్ కూడా అస్తలేదు. రేషన్ కార్డు లేకుంటే పింఛన్ కూడా ఇయ్యరట. కొత్త రేషన్ కార్డు కోసం ఇప్పటి వరకు మూడు సార్లు దరఖాస్తు చేసినం. మీ సేవల దరఖాస్తు చేసినట్లు రిసిప్ట్ కూడా ఇచ్చిను. ఆరు నెలల కింద పంచాయతీ ఆఫీసర్లు ఇంటికి వచ్చి అన్ని వివరాలు రాసుకున్నరు. గుడిసెలో ఉండే మాలాంటి పేదలకు రేషన్ కార్డు ఇయ్యరా సార్ అని అడిగినం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. కొత్త కార్డులు ఇస్తమని అంటున్నరు. తొందరలోనే అస్తయ్ అని చెప్పి వెళ్లిపోయిను. ఆరు నెలలు దాటింది. ఇప్పటిదాకా రాలేదు. ఎవరిని అడిగినా ఎప్పుడు అస్తయో తెల్వదంటున్నరు. మా భర్త నర్సయ్య పొద్దంతా అడవికి పోయి పశువులు కాస్తడు. వచ్చే కూలీ పైసలతో నూకలు కొనుక్కొని తింటున్నం. మా పిల్లలకు బియ్యంతో వండిన అన్నం తినిపించే అదృష్టం కూడా మాకు లేదా? వెంటనే రేషన్ కార్డు ఇచ్చి మా కుటుంబానికి న్యాయం చేయాలి.*

**- అల్లెపు వెంకవ్వ, దరఖాస్తుదారు, తర్లపాడ్, ఖానాపూర్ మండలం.**

### రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నం..



*మాది చాలా పేద కుటుంబం. మా ఇంట్లో భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మా భర్త రోజు కూలి పనికి వెళ్తేనే కుటుంబం గడుస్తుంది. అలాంటింది మాకే రేషన్ కార్డు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తు చేసుకోమని చెప్పిను. రేషన్ కార్డుతోపాటు మహాలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసిన. ఇప్పటి వరకు ఒక్కటి కూడా రాలేదు. మళ్లీ కుల గణన సర్వే చేసినప్పుడు కూడా రేషన్ కార్డు లేదని రాసుకున్నరు. మాలాంటి పేదలకు రేషన్‌కార్డు అందజేసి ఆదుకోవాలి. మళ్లీ సర్వే చేసేందుకు అధికారులు వస్తరని చెబుతున్నరు. ఇప్పుడు సర్వే చేస్తే ఇంకెన్ని రోజులకు రేషన్ కార్డులు ఇస్తరో అర్థం కావడం లేదు. ఈ ప్రభుత్వం పేదల గురించి అస్సలు పట్టించుకోవడం లేదు.*

**- బోయినపెల్లి లహరి, రేషన్‌కార్డు దరఖాస్తుదారు, చొండి గ్రామం, కుభీర్ మండలం**

### ఒక్క పూటే తింటున్నం..



*నా భర్త ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తే వచ్చే కూలీ పైసలతోనే మా ఇల్లు గడుస్తుంది. మాకు ఏడేళ్ల కూతురు ఉంది. మా పెళ్లికంటే ముందు మా అత్తమ్మ నర్సవ్వ, భర్త నరేశ్ పేర్ల మీద (తల్లి, కొడుకులకు) ఇద్దరిది కలిపి ఒకే రేషన్ కార్డు ఉండే. కొద్ది రోజుల తర్వాత మా అత్తమ్మ చనిపోయింది. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని మీ సేవకు వెళితే.. మీ భర్త పేరు మీద ఇప్పటికే రేషన్ కార్డు ఉంది. దాంట్లోనే మీ కుటుంబ సభ్యుల పేర్లు ఎక్కియ్యచ్చని చెప్పిను. దీంతో పాత రేషన్ కార్డులోనే నాది, మా కూతురి పేరు ఎక్కించాలని సంవత్సరం కింద మీ సేవలో దరఖాస్తు చేసినం. రిసిప్ట్ పట్టుకుని ఆఫీసుల పొంటి తిరుగుతున్నా ఎవరూ పట్టించుకుంటలేరు. పంచాయతీ సెక్రటరీని కలిసి అడిగితే మేమేం చేయలేం ప్రభుత్వం ఇచ్చినప్పుడు తీసుకోవాలి అంటున్నరు. కార్డులో ఒక్కడి పేరే ఉండడంతో నెలకు ఆరు కిలోల బియ్యమే అస్తున్నయ్. ఒక పూట తింటే ఇంకో పూట ఉపాసం ఉంటున్నం. మా పేర్లు కూడా రేషన్ కార్డులో ఎక్కిస్తే నెలకు 18 కిలోల బియ్యం అస్తయ్.*

**- అల్లెపు లావణ్య, రేషన్‌కార్డు దరఖాస్తుదారు, తర్లపాడ్ గ్రామం, ఖానాపూర్ మండలం**